# బార్హస్పత్యము

బృహస్పతీ, చార్వాకుడూ మంచిమిత్రులు, బాగా పెద్ద చదువులు చదివి వుద్యోగాల్లో చేరారు. కానీ యేదో ఆరాటం, వుద్యోగమూ, ఆనంద మివ్వలేదు. ఉద్యోగం చేస్తుంటూనే, రిసెర్చ్ చేయాలనుకున్నారు. జీతం అందుతుంది. సెలవు పెట్టక్కర్లేదు. ఇద్దరికీ ప్రథమ శ్రేణి వచ్చింది కనక వుపకార వేతనానికి అర్జీపెడితే నెలకు మూడు వేలు శాంక్షనయింది. రిసెర్చ్ చేయాలంటే థీసిస్ వ్రాయాలంటే గైడ్ వుండాలి. చాలామంది రిసెర్చ్ స్కాలర్స్‌ని సంప్రదించారు.

"బ్రహ్మయ్య బాగానే చేయిస్తారండీ! ఆయన నాశ్రయించం డిద్దరూ. యేమేమి చదవాలీ, యెలా వ్రాయాలీ చెపుతాడు చాలా నిజాయతీ పరుడు. యెక్కడా మోసముండదు. ఆయన నాశ్రయించి సేవ చేసిన వారందరూ, ఆచార్యులైనారు.

యేమాట కామాటే చెప్పుకోవాలండీ! కొంతమంది సోమరులు, తాము వినోదయాత్రలు, జాయ్ రైడ్సూ చేస్తూ గైడ్ చెయ్యి తడి చేశారు. జాలిగుండె. ఆయనే సిద్ధాంతమంతా వ్రాసి పెట్టాడట. "తమాషాగా నవ్వి వీపుమీద చరిచి వెళ్లారు సలహా యిచ్చినవాళ్లు. బృహస్పతీ చార్వాకుడూ ఆటే చూశారు.

తిరిగి తిరిగి బ్రహ్మయ్య బిల్డింగ్ తెలుసుకున్నారు. పది అంతస్తుల బిల్డింగ్ అది. బ్రహ్మలోకం, గోలోకం, తపో లోకం, అలా పై అంతస్తుల పేర్లు కనిపించాయి గిల్టు అక్షరాల్లో అది పల్లపుప్రదేశం అందుకని బేస్‌మెంట్ కిందగూడా అంతస్తులున్నాయి. లిస్టున్నది. అతల, వితల, సుతల, తలాతల, పాతాళ అవీ అయిదంతస్తుల పేర్లు. కాళ్లు పెట్టుకునేందుకు మూ

డంతస్తుల గారేజీ అద్భుతంగా వున్నది. మొత్తం బిల్డింగ్‌కి బ్రహ్మయ్య అపార్ట్‌మెంట్స్ అనిపేరు. ధగ ధగలాడే బంగారు అక్షరా లున్నాయి.

బృహస్పతీ, చార్వాకుడూ లిఫ్టులోవెళ్ళి బ్రహ్మలోకం అనే అపార్ట్‌మెంట్ ముందు నిలబడి బెల్ కొట్టారు, సరస్వతి అనేపేరు గల సెక్రెటరీ, పమిట పిన్నుకి ఐడెన్టిటీ కార్డున్నది. తలుపుతీసి, వీరినిచూసి నవ్వి వెళ్లిపోయింది. వీళ్లిద్దరూ లోపలి కడుగుంచారు. బ్రహ్మయ్యగారు, కమలం లాగావున్న మెత్తని పరుపు మీదకూచుని, బాలీసుకానుకుని పరాయి విశ్వవిద్యాలయంనించీ ఒక అచార్యుడు పంపిన. సిద్ధాంతం చదువుతున్నాడు, పుస్తకమే ఆకర్ష వంతముగా వున్నది. నల్లని అట్టమీద గిల్టు అక్షరాలు, బొద్దైన సుందరిలాగా వున్నది.

తలెత్తాడు బ్రహ్మయ్య. కొద్దిగా చిరాకు గలిగింది. అయినా మన్నించినట్టు కనిపించాడు.

యెవరుమీరు? యేం పనిమీద వచ్చారు? ఆ మెత్తల మీద కూచోండిద్దరూ. యేంచేస్తువుంటారు?

నాపేరు బృహస్పతి గురూజీ! మిమ్మల్ని గైడ్‌గా పెట్టుకోమని, లాభిస్తుందనీ, యిదివరలో మీవద్ద శిష్యరికం చేసినవారు చెప్పారు, గురూజీ! నేను జూనియర్ కాలేజీ లెక్చరర్ని, అన్నాడు వినయంగా. తీయనిగొంతు, మనిషి అందగాడు. వహిలా పచ్చీస్‌లో వున్నాడు. మంచి దుస్తులు,

బ్రహ్మయ్య పరిశీలనగా చూశాడు. తెలివితేట లున్నట్లే కనిపిస్తున్నాడు గానీ, మోసంగూడా చేతాను అన్నట్లున్నదా

వినయ ప్రదర్శన. ముక్కుమీద కళ్ళజోడు దిద్దుకోకుండానే జారుతున్న అద్దాలమీదుగా రెండో మనిషిని ప్రశ్నిస్తున్నట్టు చూశాడు.

నమస్తే, గురూ! నాపేరు చార్వాకుడు, నేనూ బృహస్పతి చేసే ఉద్యోగం లాంటిదే వెలిగిస్తున్నా. ఈ బృహస్పతి నా సహాధ్యాయి, మిత్రుడు, కొలీగ్. రిసెర్చ్ చేద్దాంరా అని లాక్కొచ్చాడు. నాకైతే అటే ఆశలేదుగురూ! మూడేళ్ళలో యేమి గ్రహించగలం? యెంత చదవగలం, యే పాటి వ్రాయగలం ఆ వచ్చే బిరుదుయేమి ఒరిగిస్తుదీ? అనుభవం వల్ల గ్రహించ వలసినదాన్ని, చదివి గ్రహించగలమా? అని సంశయం గురూ! యేదో వీడి మాట తీసివేయలేక వచ్చానుగురూ! వీడే శ్రమించి, నాక్కూడా వుపకారవేతనం తెప్పించాడు, గంభీరంగా చూశాడు.

నా దగ్గరకే యెందు కొచ్చారూ? యింకా హేమాహేమీలున్నారే. బ్రహ్మయ్య అడిగాడు.

వీడు చెప్పాడుగాగురూ! మీపేరే చెప్పారు. ముఖ్యంగా నారద అనేపేరు గలవాడు మిమ్మల్ని రికమెండ్ చేశాడు. చాలా పొగిడాడు. మీ మానస పుత్రుడినన్నాడు. మీరు తనకు గాడ్ ఫాదర్ అన్నాడు.

వాడా! వాడలాగే తీయగామాట్లాడుతాడు. తీయనిగాత్రం తీయగా పాడుతాడు. కానీ వాడేం చదివేవాడు గాదు, వ్రాసే వాడూగాదు. ఇహిహి అని నవ్వుతూ, చిడతలు వాయిస్తూ మహతి మీటుతూ గంతులేసేవాడు ఆ సరస్వతికి తైరుపోస్తూ

దాన్ని మెప్పిస్తూ, సిద్ధాంతమంతా నాచేతే వ్రాయించాడు. వాడికి పని తగిలించవోకు అని సెక్రటరీని కూకలేశాను.

వాడు సిద్ధాంతీకరించాలి. టైము చాలదు అన్నా.

పని కల్పించకపోతే, వాడు మూడు లోకాలూ బలాదూర్ తిరుగుతూ, తంపీలు పెట్టి నవ్వి వస్తున్నాడు. సత్యాదేవికి పురెక్కించి వస్తాడు. రావణునికి మతి పోగొట్టి వచ్చాడు. కలహభోజనుడు అని నిక్‌నేమ్ తెచ్చుకున్నాడు. ఆ మహతి యెందుకు యిచ్చారు వాడికి? భూలోకంలో ప్రాంతీయ భాషల్లో, విడుదల అయ్యే కొత్త సినిమాలన్నీ చూసొచ్చి, ఆ ఫిల్మ్ సంగీతమంతా వినిపిస్తున్నాడు. ఆ ఆకతాయి స్వభావం కట్టుబడాలని పని చెప్తున్నాను అని సుదీర్ఘమయిన జవాబిచ్చింది సెక్రటరీ. మీక్కూడా నేనే చదివి వ్రాసి పెట్టాలా? ఈ జుట్టెందుకూడిందీ? బట్టతలెందుకయిందీ? దయా ధర్మమా అని మీబోటి సోమరులకి పనంతా చేసి బిరుదులిప్పించేప్పటికయింది. అని బట్టతల రాచుకున్నాడు బ్రహ్మయ్య.

క్షమించాలి గురూ! అలా నిరాశపరిస్తే యెలా? మీకు యెదురు చెప్పం అని మాటిస్తున్నాము. మేమే చదివి రాస్తాము మీరు అండర్‌లైన్ వేసి టిక్ పెడితే చాలు. మేమే చక్కగా క్లుప్తీకరించి సాపుతీసి చూపిస్తాము. మీరు మెచ్చాకే టైప్ చేయించి బైండ్ చేయిస్తాము. కనికరించండి గురూ! బృహస్పతి నేలకి తల అనించి మొక్కాడు.

బ్రహ్మయ్యకి నవ్వొచ్చింది. వీడు ఎడ్వైసిక్ లాగా పట్టుకున్నాడే అనుకున్నాడు.

మన్నించాలి గురూ! నారద పెట్టిన థీసిస్‌కి టైటిల్ ఏమిటీ చార్వాకుడు నిలబడే అడిగాడు.

వీడు త్వరగా సిద్ధాంతం పెట్టేయాలని ఆలోచిస్తున్నట్టున్నాడు అనుకున్నాడు బ్రహ్మయ్య.

ఆదా హరితత్త్వము అని టైటిల్. వాడేం చదవలేదు. నారాయణ నారాయణ అంటూ తిరిగేవాడు. ఇంటికొచ్చి నరులను గురించి తెగ వాగేవాడు. నరులందరిలోనూ నారాయణుడున్నట్టున్నాడు గురూ! హరిచేసే మాయలు చాలామంది చేస్తున్నారు. యుద్ధాలు తెస్తున్నారు. సంధి పడగొడుతున్నాడు. జనక్షయానికి కారకుడవుతున్నాడు. జనాభా పెరక్కుండా సాయపడుతున్నాడు. పూజనీయులవుతున్నారు. పేరు తెచ్చుకుంటూ డబ్బు చేసుకుంటూ మనుషుల్ని గుప్పిట పెట్టుకుంటున్నారు. అని వ్రాశాడు. వాడిచేత పుస్తకాలూ, పత్రికలూ చదివించేప్పటికి నాహత మారింది. మీరిద్దరూ మరొకర్ని గైడ్‌గా యెన్నుకోండి. అవుగో, చూశారా. ఆ థీసిస్‌లన్నీ చదివి ఓ కే అని రాయాలి నాకు తీరికేదీ? ఓపికేదీ? అని నాజూగ్గా కసిరాడు బ్రహ్మయ్య.

బృహస్పతి నడుముకి ఉత్తరీయం బిగించి, సాష్టాంగ పడ్డాడు. చార్వాకుడికి సన్న చేస్తే, చార్వాకుడూ సాష్టాంగ పడ్డాడు. కాని తలెత్తలేదు. బృహస్పతి తలెత్తాడు.

అనుగ్రహించండి గురూజీ! యేదయినా పని చెప్పండి, గురూ! మాకు చాతగాదు అనము. దొడ్డంతా గడ్డి మొలిచింది

దోకమా? పూల మొజ్కలూ, కూరపాదులూ, ఆకు మడులూ వేసి దొడ్డంతా కన్నుల పండువుగా చేయమా అన్నాడు దీనంగా

బ్రహ్మయ్య నవ్వాడు. సరస్వతీ! అని పిలిచాడు

సరస్వతి వచ్చింది

లేవండిద్దరూ భోజనం చేయాలి వడ్డించాను గురువుగారు గైడ్ చేస్తారు అందుకే నన్ను పిలిచారు లేచి రమ్మని సన్న చేసింది

ఇద్దరూ లేచి ఆమెననుసరించారు

## 2

బృహస్పతీ! ఈ గురువింతవరకు చెప్పిందీలేదు, చచ్చిందీలేదు, ఈ సెక్రటరీయేమో నవ్వుతూ చాకిరీ చేయిస్తున్నది ఈ బ్రహ్మయ్య మోసగాడేమో, పోదామా? మరొక గైడ్‌ని వెట్టుకుందామా? అన్నాడు చార్వాకుడు నీళ్ళు తోడీ, తోడీ తాడు ఒరిపిడికి బొబ్బలెక్కిన అరచేతులు చూచుకున్నాడు

తొందరపడకు మిత్రమా! వేగిరింపబడియు విషమెయగును అని సామెత సాధనమున పనులు సమకూరు ధరలోన అని సూక్తి నీళ్ళు నే తోడితాలే నువ్వు గొప్పు తవ్వు, లేదా యెండాకులేరి పారేసి రా! నీళ్ళు తోడేవని అందుకున్నాడు

చార్వాకుడు వప్పుకున్నాడు. మిత్రుడు చెప్పింది చేసాడు. కాలం గడిచింది, గడ్డాలు మీసాలూ పెరిగాయి యిద్దరికీ సరస్వతి పని తాకిస్తునే వున్నది. క్షణం కంటి యెదుటి నించి పోనివ్వదు.

నేపోతా బృహస్పతీ! నువ్వు శిష్యరికం చేయి. అన్నాడు చార్వాకుడు. మాసిన గడ్డం చూసు కున్నాడు విసుగ్గావున్నది.

ఇవాళ టైటిల్ అడుగుతా పోవోకు. పోయి యేమిచేస్తావు శ్రద్ధా భక్తి యింటరెస్టు లేని కురిని నాగమ్మలకి, యేదో బోధిస్తున్నట్టు నటించటమేగా, మంచికిండే పెడుతున్నది శొక్రటరీ. మొన్న నీకు టెంపరేచర్ తాకేప్పటికి, వరీ అయింది. ధన్వంతరినీ, చరకుడునీ, శుశ్రుతుడినీ, పిలుచు కొచ్చింది. వాళ్ళు చాలాకష్టపడి రాత్రి నగలూ చదువుతూ, వ్రాసుకుంటున్నారు వడకవేసై యెట్లా? త్వరగా తగ్గేట్టు చూడండి, అని పూదర పెట్టింది. నువ్వు లేచి తిరిగాక నవ్వింది. ఓదార్పుగా అన్నాడు బృహస్పతి.

యేమో అదంతా నాకు నాటకంలాగావున్నది. నువ్వన్న మాట నిలబెట్టుకుంటే వుంటా, లేకపోతే పోతా అన్నాడు చార్వాకుడు.

బృహస్పతి తనమాట నిలబెట్టుకున్నాడు.

గురువుగారూ! మీకు తీరికలేదని, మేమే టైటిల్ సెటిల్ చేశాము. చదివీ చదివీ కంటిచూపు తగ్గిపోతున్నది గురూజీ! ఐ స్పెషలిస్టుని కన్సల్టింగ్ చేస్తే గ్లాసెస్ వేసుకోవాలి అన్నాడు గురూజీ! అన్నాడు బ్రహ్మయ్య కాళ్ళు పట్టుతూ.

బ్రహ్మయ్య దిన పత్రిక నారాయణ్ అనేది చదువుతున్నాడు. విద్యుద్దీపం బార్‌లైట్ వెలుగుతున్నది.

కంటికి అద్దాలా పెట్టుకోండిద్దరూ. తెలివితేటలేమోగానీ, యింకా అప్టూడేట్‌గా, అందంగ కనబడతారు అన్నాడు. బృహస్పతిని చూసి జాలిపడ్డాడు.

యేమని పెట్టారు టైటిల్? ఇద్దరిదీ ఒకటే? అడిగాడు.

బ్రహ్మవిద్య అని టైటిల్ గురూజీ!

ఫోన్ తిరుగుతుంది దానివంక చూశాడు బ్రహ్మయ్య లేచి కూచున్నాడు, కాగితం, పెన్నూ అందుకుని, పుస్తకాలలిస్టు వ్రాసి యిచ్చాడు. బ్రహ్మసూత్రాలు, ప్రస్థానత్రయం, యోగవాశిష్ఠము, వేదాంత పంచదశి, పూర్వ మీమాంస, ఉత్తర మీమాంస, శ్రీ కలా వరివస్యా రహస్యం, సేతుబంధం, నిత్య హృదయం.

లైబ్రరీకెళ్ళి, ఆవి సేకరించి చదవాలి. బ్రహ్మ విద్య అంత తేలికా? అని సీరియస్‌గ చూశాడు.

సరస్వతిని నేను కంట్రోల్ చేస్తాలే. పోయి ఆ కాసిని పుస్తకాలూ చదవండిద్దరూ. అవి పూర్తికాగానే థీసిస్ రాయిస్తా వీపు తట్టి పంపేశాడు.

3

ఇవాళ మంచిరోజు గురువుగారు! మీరుచెప్పిన గ్రంథాలు చదివేశాం. మీరు కొంచెం వీలుతీసుకుని విశదీకరిస్తె సిద్ధాంతం రాసేస్తాం. వేయి పుటలు చిత్తు చదివి సంక్షిప్తం చేయాలి గురు. తర్వాతా చానా పని వున్నది. టైప్డ్ మేటర్ మళ్ళీ చదవలెను, ముందుమాట రాయాలి, కృతజ్ఞతలు తెలపాలి. యేవే.

వి సంప్రదించామో లిస్టు రాయాలి బృహస్పతి నసుగుతూ, మెడ గోక్కుంటూ అన్నాడు.

చిక్కిపోయి గడ్డాలూ, మీసాలూ పెరిగి కళ్ళజోళ్ళు ధరించిన బృహస్పతినీ, చార్వాకుడినీ చూశాడు బ్రహ్మయ్య.

అలాగే మీరిద్దరు పెద్ద మూకుళ్లు సంపాయించి, వాటి నిండా నూనెపోసి, యెదురుగ పెట్టుకుని పద్మాసనం వేసుకుని కూచోండి అన్నాడు.

ఇద్దరు అలాగే చేశారు.

వాటిలోకి చూడండి యిద్దరు

ఇద్దరూ నేలమీద కూచుని, మూకుళ్ళు, దానిలో కదలకుండా వున్న, అద్దంలాగావుండి భ్రమకలిగిస్తున్న నూనెవంక చూశారు.

బాగా శ్రద్ధగా చూచుకున్నారా? బ్రహ్మయ్య భావగర్భితంగా నవ్వుతూ అడిగాడు.

మరలా ఇద్దరూ నిదానంగా మూకుడులో వున్న నూనెలోకి చూచారు. కొంచెం సేపు చూసి తలెత్తారు. చేతులు కలిపి ముందుంచుకుని గురువును చూచారు.

చూశాం గురూజీ! బాగా చూశాం అన్నాడు బృహస్పతి.

బ్రహ్మయ్య విశాలంగా నవ్వి అన్నాడు.

అదే బ్రహ్మవిద్య. అది అర్థం గావాలనే ఆ గ్రంథాలు చదవమన్నా. ఇద్దరు ఒకే టైటిలు పెట్టుకున్నా, మీ తాహతు కొద్దీ, మీకు కలిగిన జ్ఞానాన్ని బట్టి మీరు చదివినవీ, చూచినవీ, గుర్తు తెచ్చుకుంటూ, చెత్త వదిలేసి, థీసిస్ పెట్టేసి తీసుకురండి నేను సంతకం చేస్తా. ఆచార్య బిరుదు యిచ్చేవారిని ముగ్గురిని

యెన్నిక చేసేశాను. ముగ్గురు మూడు వేరు వేరు విశ్వవిద్యాలయ ఆచార్యులు. అయిదేసి పుస్తకాలు తయారుచేసుకోండి. ఒకటి మీకు, ఒకటి నాకు, అంటే స్పేర్ పుస్తకం నాదగ్గర భద్రపరుస్తా. మూడు పుస్తకాలూ ముగ్గురికీ పంపేందుకు. పొండిద్దరూ చాలా వోర్మి చూపారు. చాలా శ్రమించారు. సంతోషించాను. నా ఆశీస్సులు మీకు ఉంటాయి. అంటూనే నిద్రకు పడ్డాడు బ్రహ్మయ్య.

## 4

బృహస్పతి థీసిస్‌లో యేమున్నదంటే, బృహస్పతికి అర్థమైందేమిటనగా, నేను థీసిస్ వ్రాయటానికీ, బిరుదుకోసమూ వచ్చినప్పుడు, ఆరోగ్యంగా బలంగా, సంతోషంగా, వుత్సాహంగా వున్నాను. కాని చివరిరోజు ముకురంలోకి చూడగా, నేను కాదేమో అన్నట్టున్నది. నా ప్రతిబింబం, గడ్డాలూ, మీసాలు, పీక్కుపోయిన మొహం, కళ్ళజోడూ, ఆశానిరాశల మధ్యవూగే ఆలోచనతో వున్న మొహం కనిపించింది. వీడా బృహస్పతి? కాదు. అనిపించింది. కనక తేలిన దేమనగా యీ కంటికి కనబడేదీ, చెవికి వినబడేదీ, సత్యంగాదు అసలైన బృహస్పతి వేరే వున్నట్టీ మాయను గెలిచి, సత్యమేదో నిత్యమేదో తెలుసుకోటమనేదే బ్రహ్మవిద్య, యోచనచేసి, మోసాన్ని అసత్యాన్ని గ్రహించి, యెదుర్కొని, బైటబెట్టి గెలుచుకు రావాలి. అపారమైన ధనం ఒకచోట యెలా పేరుకుంటున్నదీ? మతం పేరిట అధికారం సంపాయిస్తున్నారనీ, యెక్కువగా తెలివీ ధైర్యమూ, యెదిరించేశక్తి లేని వారిని, అణిచి పెడుతున్నారని నిరూపించాలి. అదీ బ్రహ్మవిద్య. అదంత సులభం గాదు. కానీ ధైర్యమూ, తెలివితేటలూ ఓరిమీ కావాలి.

అవన్నీ కష్టతరం గనక అదే బ్రహ్మవిద్య. అదే అర్థమై వంట బట్టాలి. అని తెలిసింది.

చార్వాకుడి కర్థమైందేమనగా, 'నేనే బ్రహ్మను. ఈ శరీరమే ముఖ్యము. దీన్ని సుఖపెట్టి గౌరవంగా చూడాలి. అందరి శరీరాలూ రక్తమాంసాలతో నిర్మితమైనవే. అందరూ సుఖపడాలి. అందరూ గౌరవంగా బతకాలి. బ్రహ్మ అనేది వేరేలేదు. అందరూ సుఖంగా వుండాలి గనక, యెక్కువగా వున్న దానిని పంచియిచ్చి, వాళ్ళసుఖమూ చూడాలి. యెవరూ కష్టపడాల్సిన అవసరం లేదు. ఒడిదుడుకులవల్ల, దారిద్ర్యం వల్ల, కష్టమూ రోగము పట్టి పీడిస్తుంటే, చూస్తూ వుండరాదు. నీ దగ్గరుంటే యిస్తావు. నీదగ్గర లేదనుకో, ఉన్నవాడిని యిమ్మని అడగాలి మూర్ఖుడై అవివేకి అయి యివ్వడనుకో వానిని చావగొట్టిఅయినా లాక్కుని యివ్వాలి, బలా బలాలే ముఖ్యం. శరీర సౌఖ్యమే ముఖ్యం! నాకున్నప్పుడు నీ కివ్వలేదా? నువ్వడిగేదాకా చూస్తూ కూచున్నానా ? నాతోపాటు నువ్వూ సుఖపడాలని చూశానా, లేదా? అనాలి. దబాయించాలి. లాక్కోటమే. అది అవినీతి గాదు. అలా చేయఁ గలగటమే రావాలి. అదే బ్రహ్మ విద్య. అటువంటి సమర్థతగల వాడే బ్రహ్మ, పై నెక్కడోలేదు. మనుషులను వదలి విడిగా లేడు. ధర్మమూ, చట్టమూ అందరికీ సమానమే. ఈ జీవితమూ, ఈశరీరమూ శాశ్వతము. ముఖ్యం లేనిదానిని వున్నట్టు వూహించి, పూజలూ, వ్రతాలూ, దానాలూ మొక్కుకోవటం అర్థం లేనిపని. దండగ అదంతా మోసం. మనిషి కర్తవ్య పరాయణుడుకావాలి, సుఖపడాలి, పేరు ప్రఖ్యాతులూ ధనమూ సంపాదించు కోవాలి అలా చేయగలగటమే బ్రహ్మవిద్య, అది రావాలి. అది చాతగావాలి, బలిమినైనాసరే

ఇద్దరు థీసిస్ పెట్టేశారు. ఒకరి థీసిస్ ఒకరు చదివారు. ఇద్దరికీ యింక బ్రహ్మయ్యతో అవసరం పడలేదు.

బృహస్పతి ఫూల్! వాడికి బ్రహ్మవిద్య సరిగా అర్థంకాలేదు మోసాన్ని మోసంతోనే యెదుర్కోవాలి. భుజ బలమే గొప్పది. ధర్మ. అధర్మం అనే చచ్చుబొక్కు గెలుస్తాదా ప్రపంచంలో? గెలుచుకొచ్చినవాడే బ్రహ్మ.

బృహస్పతి చార్వాకుని సిద్ధాంతం చదివాడు

వీడి సిద్ధాంతం ప్రకారం పోతే, ప్రపంచంలో దౌర్జన్యం హింసా ప్రబలిపోతాయి గెలుపేమోగానీ, పేరు ప్రఖ్యాతులేమో కానీ, సుఖమేమోగానీ, అశాంతీ, ద్వేషమూ ప్రబలిపోతాయి, అన్నిటికీ అతీతమైన శక్తి ఒకటున్నదని వీడికి అర్థంకాలేదు, బాగానే వున్నది, చెబితే వినడు కనక యేం చేయాలంటే వీడిని నమ్ముకుని, వీడి పార్టీలో చేరిన వాళ్ళందరికీ వీడి సిద్ధాంతం బోధిస్తా, అక్కడితో తిక్క కుదురుతుంది. వీడి థీసిస్ని నా పార్టీవాళ్ళ చేతుల్లో పడకుండా, మా పుస్తక భాండాగారం లోకి చొరబడకుండా భద్రతలు తీసుకుంటా నా వాళ్లు నా సిద్ధాంతమే చదువుతారు నేను చెప్పింది నమ్మి అచరిస్తారు, దాంతో యీ భూమ్మీద కొంతయినా శాంతీ, అహింసా, దయా, సత్యమూ, శౌచమూ నిలబడతాయి అని తీర్మానించుకొన్నాడు

ఆ విధంగా చార్వాకుని సిద్ధాంతం బృహస్పతి యిచ్చిన స్పీచస్ ద్వారా విన్నవాళ్ళంతా చార్వాక మతస్థులయినారు బృహస్పతి చెప్పాడు గనక దాన్ని బార్హస్పత్యము అన్నారు

కాని బృహస్పతి సిద్ధాంతం చదివిన వాళ్ళు నిదానంగా అర్థం చేసుకుని, తెలివి గలవారు, సమర్థులూ అయినారు, ఆ సిద్ధాంతాన్ని వాళ్లు మతము అనలేదు, గ్రహించి అచరించారు